

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
సోమవారం 30 డిసెంబరు 2024





చాగలమర్రి: కూలూరు రహదారిలో జొన్నపంటపై కప్పేసిన పొగమంచు

ఉసురు తీస్తున్న ముసురు

- నెల రోజులుగా జాడలేని ఎండ
- పంటపై తెగుళ్లు, కీటకాల ముప్పేట దాడి
- తేమ సాకుతో దళారుల దోపిడీ
- రబీ పంటలపై తీవ్ర వాతావరణ ప్రభావం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం రైతులను తుఫాన్లు చుట్టుముట్టాయి. చేతికి వచ్చిన పంటలు సైతం తడిసి గిట్టుబాటు ధర అందడం లేదు. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కంది తదితర పంటలకు తేమ గండం పట్టుకుంది. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర ఈసారి చేతికందుతుందనే ఆశతో రైతులు ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులకు చేతికొచ్చిన పంట ఉత్పత్తులను వ్యయ ప్రయాసలకోర్చి తీసుకువెళ్తున్నారు. అయితే.. నెల రోజులుగా ముసురు కమ్మేసి ఎండ జాడ లేకపోవడంతో పది నుంచి 20 శాతానికి పైగానే పంట ఉత్పత్తులకు తేమ పట్టేసింది. ఈ సాకుతో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు మద్దతు ధరలో దాదాపు 30 శాతం ధర తగ్గించి మిగిలింది రైతుల చేతిలో పెడుతున్నారు.



ఈ రైతు పేరు గోరంట్ల, ఈయనది ప్యాపిలి. తనకున్న నాలుగెకరాల పొలంలో దాదాపు రూ.లక్ష ఖర్చు పెట్టి వేరుశనగ పంటను సాగు చేశాడు. 20 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. శుక్రవారం ట్రాక్టరులో వేరుశనగ బస్తాలను కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చాడు. తేమ 20 శాతం కంటే ఎక్కువగా ఉందని కుంటి సాకు చెప్పి వ్యాపారి క్వింటానికి రూ.4,900లు మాత్రమే చేతిలో పెట్టాడు. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదని, అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని విలేకరుల ముందు గొల్లుమన్నారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పత్తి, పొగాకు, వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేసిన రైతులందరిదీ ఇదే పరిస్థితి.



కొలిమిగుండ్లలో పంటపొలాలపై కురుస్తున్న పొగమంచు

నెల రోజులైనా ఎండ రాలేదు..

గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులపై అల్పపీడనం, తుఫాన్ తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దాదాపు నెల రోజులుగా ముసురు వీడడం లేదు. ఎండ జాడ లేకపోవడం వల్ల రైతులు పత్తి తీయడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ యంత్రాంగం మండల, జిల్లా కేంద్రాల్లోని నివాసాలకే పరిమితం అవుతుండటంతో తమకు సరైన సలహాలు ఇచ్చే వారు లేక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. మండల కేంద్రాల్లో పని చేసే వ్యవసాయాధికారులతో పాటు చివరకు గ్రామాల్లో రైతు సలహా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది కూడా ప్రస్తుతం నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లోనే తిష్ట వేస్తున్నారు. వారానికి ఒకసారి రైతులకు ముఖం చూపించి గంటకే తిరిగి వచ్చేస్తుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.



ముసురు, చినుకులకు పాడైన కొర్ర పంట నిల్వ

రబీ పంటలకూ ముప్పే

ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ, వేరుశనగ, మిర్చి, ఉల్లి తదితర పంటలను ముసురు కమ్మేసింది. ఎండ జాడ లేకపోవడం వల్ల మిర్చి పంటకు నల్లి, తామర, ఆకుముడుత తెగుళ్లు భారీగా వ్యాపించాయి. పొగాకు పంటకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈ సంవత్సరం 50 వేల ఎకరాల్లో పొగాకు పంటను రైతులు సాగు చేశారు. గత సంవత్సరం క్వింటం పొగాకు కంపెనీలు రూ.15 వేలకు పైగానే ధరను రైతులకు చెల్లించారు. ఈసారి నిబంధనల కంటే తేమ ఎక్కువగా ఉందని సాకు పెట్టి క్వింటానికి రూ.10 నుంచి 13 వేలు మాత్రమే అందజేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు ఆరు లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. రాష్ట్రంలో అత్యధికంగా ఈ పంట సాగైన జిల్లాల్లో కర్నూలు మొదటి స్థానంలో ఉంది. సీసీఐ అధికారులు 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉంటేనే క్వింటానికి రూ.7,521 అందిస్తామని చెప్పారు. తేమ శాతం ఉండడంతో రైతులు రూ.6 వేల నుంచి రూ.6,500కే దళారులకు గ్రామాల్లోనే అమ్మేస్తున్నారు. వేరుశనగ కాయలకు గత సంవత్సరం రూ.8 వేల దాకా అందింది. దాదాపు 2 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగైంది. గత సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఈసారి 8 క్వింటాళ్లకు పైగా చేతికి రావడంతో రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అప్పులన్నీ తీరిపోతాయని, కుటుంబ జీవనానికి ఢోకా ఉండదని ఆనందించారు. నెల రోజులుగా ఎండ తెరపి ఇవ్వకుండా ముసురు కమ్ముకోవడంతో వేరుశనగ కాయల ధర భారీగా పతనమైంది.

పంటల ధరపై తేమ ప్రభావం



కర్నూలు యార్డుకు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు

క్వింటానికి మద్దతు ధర కేవలం రూ.5వేల నుంచి రూ.5,500 వరకు మాత్రమే రైతుకు అందుతోంది. మొక్కజొన్న రైతుల పరిస్థితీతి మరీ దారుణంగా ఉంది. ఖరీఫ్‌లో సాగు చేసిన ఈ పంట ఇప్పుడిప్పుడే రైతుల చేతికి అందుతోంది. ఈ ముసురు కారణంగా పెరిగిన మొక్కజొన్న గింజలను ఆరబెట్టుకోవడానికి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి దాపురించింది. క్వింటం మొక్కజొన్నలకు కేంద్ర ప్రభుత్వం రూ.2,350 నిర్ణయించింది. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డులో రూ.2వేల నుంచి రూ.2,100 వరకు రైతులకు అందుతోంది. కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, తెలుగు గంగతోపాటు బోరు బావుల కింద రైతులు దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.1700 మద్దతు ధర ప్రకటించింది. అయితే.. దళారులు తేమ పేరుతో భారీగా దోపిడీకి తెరలేపారు. 18 శాతం కంటే తేమ ఎక్కువగా ఉండటం వల్ల మద్దతు ధర కంటే తక్కువగా రూ.1,300కే అమ్మాలని షరతు పెడుతుండటంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

రైతులు జాగ్రత్త పడాలి

పొలాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పంట నష్టం గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం ముసురు వానలు పడుతుండటం వల్ల నీరు పొలాల్లో నిల్వ లేకుండా చూసుకోవాలి. ప్రస్తుతం కోతలు చేయరాదు. ఎప్పటికప్పుడు గ్రామాలకు వెళ్లి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేయాలని మా అధికారులు, సిబ్బందిని ఆదేశించాం



- వరలక్ష్మి, జేడీ

విద్యుత్ చార్జీలు పెంచింది వైసీపీనే

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంచిన పాపం వైసీపీదేనని, నాడు వైసీపీ చేసిన తప్పిదాలు నేడు ప్రజల పాలిట ఉరితాళ్లు అయ్యాయని రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లెలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని, ప్రజాగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. 2019లో టీడీపీ అధికారంలో నుంచి దిగిపోయే సమయానికి ఆంధ్రప్రదేశ్ మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉందన్నారు. సీఎం జగన్ అవినీతి, అసమర్థ విధానాల వల్ల నేడు డిస్కమ్‌లపై రూ.1,29,593 కోట్ల అదనపు భారం పడిందన్నారు. జగన్ పాలనలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను దగా చేశారని మండిపడ్డారు. బినామీ కంపెనీలకు దోచిపెట్టేందుకు విద్యుత్ లోటును సృష్టించి అస్మదీయుల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేసి విద్యుత్ రంగాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందన్నారు. వైసీపీ హయాంలో ఏపీ జెన్‌కో పూర్తిగా సర్వనాశనం అయిందన్నారు. నాడు పీపీఏలను రద్దు చేయడం, సౌర, పవన విద్యుత్ పెట్టుబడి దారులను జగన్ బెదిరించి రాష్ట్రం నుంచి వెళ్లగొట్టడంతో నేడు రాష్ట్రంలో 10వేల మెగావాట్ల పునరుత్పాదన ప్రాజెక్టులకు కోల్పోవడానికి కారణమయ్యారని ధ్వజమెత్తారు. పీపీఏల సమీక్షల పేరుతో నాడు సీఎం జగన్ చేసిన హడావుడికి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. నాడు జగన్ బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోలు చేయడంతో ఉత్పత్తి సంస్థలు న్యాయ పోరాటానికి దిగితే, నాడు వాడుకొని విద్యుత్‌కు కూడా నేడు పీపీఏల ధరల ప్రకారం నేడు బిల్లులు చెల్లించాలని డిస్కమ్‌లను ఆదేశించరాని అన్నారు. దీంతో నేడు వడ్డీతో సహా రూ.9500 కోట్లు డిస్కమ్‌లు, ఆయా సంస్థలకు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. రెండేళ్ల కితమే జగన్ విద్యుత్ చార్జీలు పెంచాలని ఈఆర్‌సీ కోరారని గుర్తుచేశారు. నాడు ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.20,165 కోట్లు ప్రజలపై అదనపు భారం వేసిన ఘనత జగన్‌దేనన్నారు. అయితే ప్రస్తుతం విద్యుత్ ధరలు పెంచారంటూ ఆందోళనలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు.

మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, చైర్‌పర్సన్లను నియమించే విషయంలో వాటికి రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు కలెక్టర్లకు బాధ్యతలు అప్పజెప్పుతూ ఉత్తర్వులు జారీ చేసిం ది. ఇందులో భాగంగా కర్నూలు మార్కెట్ కమిటీకి ఓసీ జనరల్‌ను ఖరారు చేశా రు. ఆదోని మార్కెట్ యార్డు బీసీ అండ్ మైనార్టీ (ఉమెన్) రిజర్వేషన్ ఖరారు చేశారు. ఎమ్మిగనూరు బీసీ లేదా మైనార్టీ (జనరల్)కు ఖరారు చేశారు. ఆలూరు ఎస్సీ (జనరల్), పత్తికొండ మార్కెట్ కమిటీ ఓసీ (జనరల్)కి కేటాయించారు. అలాగే కోడుమూరు ఓసీ (ఉమెన్), మంత్రాలయం ఓసీ (మహిళ)కి ఖరారు చేస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. సంక్రాంతిలోపు ఆయా మార్కెట్ కమిటీలకు కలెక్టర్ ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్లను, డైరెక్టర్లను నియమించేందుకు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి ఆ మార్కెట్ కమిటీల పరిధిలోని ఎమ్మెల్యేల చేత ప్రతిపాదనలు తీసుకోనున్నారు.

నంద్యాల జిల్లాలో..

నంద్యాల జిల్లాలోని 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్ల, చైర్‌పర్సన్ల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల మార్కెట్ కమిటీ ఓసీ (మహిళ)కు, ఆళ్లగడ్డ ఎస్సీ(మహిళ), డోన్‌కు బీసీ (మహిళ)కి ఖరారు చేస్తూ ఉత్వర్వులు ఇచ్చారు. నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఓసీ (జనరల్)కి, ఆత్మకూరుకు ఓసీ (జనరల్), బనగానపల్లె ఓసీ (జనరల్)కి కేటాయించారు. కోవెలకుంట్ల ఓసీ (జనరల్)కి, పాణ్యం బీసీ (మహిళ)కి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీన సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఈ నెల 30వతేదీ ఉదయం 9.30గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలంలో క్యూలైన్లలో భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సంవత్సరం ముగింపు రోజులు కావడంతో స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. భక్తుల రద్దీతో క్యూ కంపార్ట్‌మెంట్స్ అన్నీ కిక్కిరిసిపోయాయి. స్వామి, అమ్మవార్ల దర్శనానికి 4 గంటలపైగా సమయం పట్టింది. రోజులో మూడు విడతలుగా స్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం కలల్పించారు.

మహానందిలో..

మహానంది, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో నిండిపోయింది. తెలుగు రాష్ట్రాల నుండే కాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుండి వేలాది మంది భక్తులు శనివారం రాత్రే తరలి వచ్చారు. దేవస్థానం వసతి గృహాలు నిండిపోవడంతో ప్రైవేట్ గదులు అద్దెకు లభించక పోవడంతో ఆలయం ముందు భాగంలో ఆరు బయట భక్తులు నిద్రించారు. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ. లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఏఈఓ మధు తెలిపారు.



మహానంది ఆలయంలో భక్తుల రద్దీ

న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



నంద్యాల క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల్లో 2024 సంవత్సరం ముగిసిపోయి 2025 నూతన సంవత్సరం రానున్న నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలపై ఈ నెల 31వ తేదీన నిబంధనలను పాటించి సహకరించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మాట్లాడుతూ న్యూ ఇయర్ ఈవెంట్స్ జరుపుకునేవారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈవెంట్స్‌కు సీసీ కెమెరాల పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. నూతన సంవత్సర వేడుకలు ప్రజలందరూ ఆరోగ్యకరమైన వాతావరణంలో జరుపుకోవాలని, జిల్లా అంతటా 30-పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. వేడుకలు నిర్వహించేవారు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం మ్యూజిక్ సిస్టం రాత్రి 10 గంటల తర్వాత వాడరాదన్నారు. రాత్రి 10గంటల తర్వాత పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నందు వల్ల అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో, ముఖ్యమైన జంక్షన్లు, ముఖ్యమైన ప్రదేశాల్లో పికెట్‌లు ఏర్పాటు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలు, చర్యలు, సినిమాలు, అశ్లీల సంజ్ఞలు తగవని స్పష్టం చేశారు. అవుట్ డోర్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో డీజే సౌండ్ బాక్స్‌లు, బాణసంచా కాల్చడానికి అనుమతి ఇవ్వడం లేదని స్పష్టం చేశారు.

మహిళలపై ఎలాంటి వేధింపులకు పాల్పడకుండా నిరోధించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని చెప్పారు. వైన్‌షాప్‌లు నిర్దేశిత సమయంలోగా మూసివేయాలన్నారు. మైనర్లకు మద్యం విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మోటార్‌సైకిళ్ల సైలెన్సర్ తీసేసి అధికశబ్దం వచ్చేలా, మద్యం తాగి రోడ్లపై తిరగరాదన్నారు. ఆకతాయిలు, మితిమీరి ప్రవర్తించే యువతను, రోడ్లపై చిందులు తొక్కే మందుబాబులను చిత్రీకరించేందుకు వీడియో కెమెరాలు, డిజిటల్ కెమెరాలు ఉపయోగిస్తున్నటు తెలిపారు. పెట్రోలింగ్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను నియమిస్తామని చెప్పారు. నిబంధనలు పాటించి న్యూ ఇయర్ వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లా ప్రజలకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

చిన్న కాంట్రాక్టర్లకు అండగా ఉంటాం

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 7

సుంకేసుల నీటిని వృథా కానివ్వొద్దు

జాయింట్ కలెక్టర్ నవ్య 7

నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం

శాంతి భద్రతలు కొంచెం నయం




2024 రౌండప్

- దొంగతనాలు ఎక్కువ.. రికవరీలు తక్కువ
- పెరిగిన రోడ్డు ప్రమాదాలు..
- సోషల్ మీడియాపై పోలీసుల ఉక్కుపాదం
- ఫలితమివ్వని ప్రచారం.. జిల్లాలో విసిరిన సైబర్ పంజా
- పబ్లిక్ గ్రీవెన్స్ ఫిర్యాదులపై స్పందన కూడా అంతంతే..
- లోక్ అదాలత్‌లో కర్నూలు పోలీసులు భేష్
- మారిన పోలీసు బాస్‌లు
- ప్రశాంతంగా ఎన్నికలు
- 2024 క్రైం రౌండప్

కర్నూలు క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కర్నూలు రేంజ్ డీఐజీ, కర్నూలు ఎస్పీగా కొత్తవారు బాధ్యతలు చేపట్టారు. డీఐజీగా కోయ ప్రవీణ్, ఎస్పీగా జి. బిందుమాధవ్ వచ్చారు. వీరిద్దరు వచ్చాక పోలీసు శాఖలో పలు మార్పులు వస్తాయనుకున్నా అలాంటిదేమీ పెద్దగా జరగలేదు. కర్నూలు, నంద్యాల జిల్లాలో సీఐలు, ఎస్ఐల బదిలీల్లో మొదట్లోనే గందరగోళానికి తెర తీసింది. వైసీపీలో కొనసాగిన చాలా మంది పోలీసు అధికారులే పోస్టింగులు దక్కించుకున్నారు. ఐదేళ్లుగా పోస్టింగ్ కోసం ఎదురు చూసిన కొంత మందికి రాజకీయ ఒత్తిడి వల్ల ఊహించిన స్థాయిలో పోస్టింగులు దక్కలేదు. అప్పట్లో వైసీపీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోని రాజకీయ నాయకులకు అనుకూలంగా ఉన్న వారే పోస్టింగులు దక్కించుకోవడం విశేషం.

పెరిగిన దొంగతనాలు.. తగ్గిన రికవరీలు



పోలీసుల రికార్డుల్లో మాత్రం గత ఏడాదితో పోల్చితే 7.45 శాతం పగటి దొంగతనాలు 7.83 శాతం రాత్రి దొంగతనాలు జరుగుతున్నాయి. అయితే చాలా దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లను పోలీసులు తమ రికార్డుల్లో నమోదు చేయడం లేదు. 2023లో 149 కేసులు కాగా.. 2024లో 138 కేసులు మాత్రమే నమోదైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. 2023లో 27 పగటి దొంగతనాలు కేసులు నమోదు కాగా, 2024లో 25 కేసులు మాత్రమే నమోదయ్యాయి. 2023లో 122 రాత్రి దొంగతనాలు కేసులు నమోదు కాగా, 2024లో 113 కేసులు నమోదయ్యాయి. పలు పోలీసు స్టేషన్‌లలో అటు దొంగతనాలు, ఇటు స్నాచింగ్‌లు కానీ కేసులు నమోదం చేయడం లేదనే విమర్శలున్నాయి. రికవరీలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2024లో రూ.5.65 కోట్లు సొత్తు చోరీకి గురి కాగా, రూ.3.67 కోట్లు మాత్రమే రికవరీ చేయించారు. కొంత మంది నిందితులను పట్టుకున్నా.. చిన్న చిన్న లోపాలతో వారిని వదిలేస్తున్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ గజదొంగను పట్టుకున్నప్పటికీ.. రికవరీ ఆలస్యం కావడంతో చట్టంలోని లొసుగులతో నిందితుడు తప్పించుకున్నాడు. ఇలాంటి ఘటనే కర్నూలు టూ టౌన్, ఫోర్త్‌టౌన్, ఆదోనిలలో జరిగాయి. చోరీకి గురైన సొత్తు తాకట్టు పెట్టుకున్న పలు సంస్థలు పోలీసుల లేఖతోనే వెనక్కు ఇచ్చామని, ఈసారి మాత్రం ఆ సంస్థలు కోర్టు ద్వారా ఆదేశాలు కావాలంటుండటంతోనే ఈసారి రికవరీలు కాస్త వెనుకబడ్డాయని తెలుపుతున్నారు.

మహిళలపై ..



2023-24లో ఒక వరకట్నం మరణం కేసు నమోదైంది. 2023లో 12 అత్యాచార కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 10 కేసులు మాత్రమే నమోదయ్యాయి. 2023లో 22 పోక్సో గ్రేవ్ కేసులు నమోదు కాగా, 22 నాన్ గ్రేవ్ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 30 గ్రేవ్ కేసులు, 32 నాన్ గ్రేవ్ కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఈ కేసులను మిస్సింగ్ కేసులుగా చూపెట్టడంతోనే ఆ సంఖ్య తగ్గిందని, ఈ ఏడాది చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడంతోనే ఈ సంఖ్య పెరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఈ ఏడాది 244 మహిళల మిస్సింగ్ కేసులు నమోదు కాగా, 232 మందిని ఛేదించారు. 154 బాలికల మిస్సింగ్ కేసు నమోదు కాగా.. 147 మందిని ట్రేస్ చేశారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

2023లో 499 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. ఈ ఏడాది 523 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. గతంలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు పలు చర్యలు తీసుకోగా.. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో పోలీసులంతా బందోబస్తు విధుల్లో ఉండటంతో ఈ ప్రమాదాలు తగ్గించడంలో కాస్త వెనుకబడ్డారు. మరోపక్క రవాణాశాఖ అధికారులు పలు బ్లాక్ స్పాట్లు గుర్తించినా.. ఆ బ్లాక్ స్పాట్లలో చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం ముందుకు రాకపోవడంతో ప్రమాదాలు అదే స్థాయిలో కొనసాగుతున్నాయి. గతంలో ప్రతి ఏడాది రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించేవారు. ఐదేళ్ల నుంచి రోడ్డు భద్రతా వారోత్సవాలు జరగడం లేదు.



సైబర్ పంజా



జిల్లాలో ఈ ఏడాది పోలీసుల ఎన్నికల బందోబస్తు నేపథ్యంలో 104 సైబర్ కేసులు నమోదు అయ్యాయి. గత ఏడాది ఇవి 41 కేసులు మాత్రమే. కొత్తగా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ బిందుమాధవ్ ఈ సైబర్ నేరాలపై పలు విద్యాసంస్థలు, వివిధ సంఘాలు, సంస్థలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినా కూడా ఈ సైబర్ నేరాల కేసులు పెరగడం విశేషం. గతంలో సైబర్ నేరాలను పోలీసులు నమోదు చేసుకోకపోవడంతోనే పెద్దగా కేసులు లేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి సైబర్ కేసు నమోదు చేయడంతో ఆ సంఖ్య పెరిగిందని పోలీసులు చెబుతున్నారు.



సెల్‌ఫోన్ రికవరీ మేళాను పరిశీలిస్తున్న ఎస్పీ(ఫైల్)

లోక్ అదాలత్‌ల పరిష్కారంలో మొదటి స్థానం!



ఈ ఏడాది నాలుగు విడతలుగా లోక్ అదాలత్‌లో కేసులుకు 3,220 కేసులు పరిష్కారించారు. మూడో లోక్ అదాలత్‌లో 3వ స్థానం, నాల్గవ లోక్ అదాలత్‌లో మొదటి స్థానంలో జిల్లా నిలబడింది. ఈ మేరకు జిల్లా పోలీసులకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది.

ఎంవీఐ యాక్టు కేసులు

ఈ ఏడాది 3,631 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి రూ.19.42 లక్షల జరిమానా విధించారు. 63,626 ఎంవీఐ యాక్టు కేసులు నమోదు చేసి రూ.2.41 కోట్లు జరిమానా విధించారు. 1225 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

2024లో 65 మట్కా కేసులు నమోదు చేసి 162 మందిని అరెస్టు చేశారు. 252 పేకాట కేసులు నమోదు చేసి 1251 మందిని అరెస్టు చేసి రూ.72.93 లక్షలు నమోదు చేశారు. మూడు క్రికెట్ బెట్టింగ్ కేసులో 6.50 లక్షలు సీజ్ చేశారు.

హత్య కేసులు



2023లో 38 హత్య కేసులు నమోదు కాగా.. 2024లో 31 కేసులు నమోదయ్యాయి. 2023లో 48 హత్యాయత్నం కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 39 హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. గత ఏడాది 15 కిడ్నాప్ కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 15 నమోదయ్యాయి.

జిల్లాలో ప్రధాన సంఘటనలు

- ఈ ఏడాది జూలై 27వ తేదీన ఆస్పరి పోలీసు స్టేషన్ పరిధిలో ఎమ్మిగనూరు మండలం మసీదుపురం చెందిన పేటయ్య అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఎలాంటి క్లూ లేకున్నా పోలీసులు రెండు రోజులోలనే పోలీసులు నిందితుడ్ని పట్టుకోవడంతో రాష్ట్ర స్థాయిలో ఈ కేసు మూడో స్థానంలో నిలిచి ఏబీసీడీ అవార్డుకు ఎంపికైంది. ఈ కేసు పోలీసు ప్రతిభకు ఉదాహరణ.
- ఆదోని పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.32లక్షల విలువైన బైకులు రికవరీ చేశారు. ఈ నెల 17న బుధవారపేటలో అసదుల్లా చెందిన పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి 31 మంది పేకాటరాయళ్లను అరెస్టు చేసి రూ.31.40 లక్షలు, రెండు కార్లు, 40 ఫోన్లు సీజ్ చేశారు.



ఆదోనిలో దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ(ఫైల్)

పోలీసు శాఖ సమర్థవంతంగా పని చేస్తోంది



గత ఏడాదితో పోలిస్తే.. ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గింది. పోలీసు శాఖ సమర్థవంతంగా పని చేయడం వల్లనే ఇది సాధ్యమైంది. ముస్ముందు కూడా శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి 5వేల సీసీ ఈ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక డ్రోన్ కెమెరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. సైబర్ నేరాల పట్ల గ్రామీణ స్థాయిలో కూడా అవగాహన కల్పించేందుకు సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసు శాఖ చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటుంది.

– జి. బిందుమాధవ్, ఎస్పీ



'అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఏర్పాటు చేయాలి'

కర్నూలు అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ఓబులేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సిల్వర్ జూబ్లీ కళాశాల కాంపౌండ్‌లోని అంబేడ్కర్ సెంటర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిశారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి నడుస్తున్న ఈ సెంటర్ల ద్వారా 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో అభ్యాసక సహాయక కేంద్రాల్లో 12 వేల మంది విద్యార్థులు చేరారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు 89 శాతం అడ్మిషన్ తీసుకుంటున్నారని, మొత్తం విద్యార్థుల్లో 48 నుంచి 49 శాతం మహిళలు ఉంటున్నారని చెప్పారు. మొత్తం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌లో 12శాతం దూర విద్య విద్యార్థులు ఉన్నారని, మొత్తం విద్యార్థుల్లో 90 శాతం బీసీ ఎస్సీఎస్టీ మైనార్టీ వర్గాలవారు ఉన్నారని చెప్పారు. తెలంగాణలోని వర్సిటీకి ఏటా ఫీజుల రూపంలో ఏటా రూ.21 కోట్లు చెల్లిస్తుండగా అందులో కేవలం రూ.4 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు హనుమంతప్ప, గంగిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం



దాతలకు ప్రసాదాలను అందజేస్తున్న డిప్యూటీ ఈవో రమణమ్మ

శ్రీశైలం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వి. భాస్కరరావు రూ.5,00,004 విరాళం ఇచ్చారు. డిప్యూటీ ఈవో ఆర్. రమణమ్మకు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

సుంకేసుల నీటిని వృథా కానివ్వొద్దు

జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుంకేసుల జలాశయం నీటిని వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పొదుపుగా వాడాలని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య నీటి పారుదల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. ఆదివారం జాయింట్ కలెక్టర్ నవ్య సుంకేసుల జలాశయాన్ని పరిశీలించారు. జలాశయ గేట్ల ద్వారా వృథాగా వెళ్తున్న నీటిని పరిశీలించారు. గేట్లను తక్షణమే రిపేరు చేయాలని స్పష్టం చేశారు. డీఈ ప్రసాద్ సుంకేసుల జలాశయంలో 1.2 టీఎంసీల నీరు నిల్వ ఉండటం వల్ల గేట్లను మరమ్మతులు చేయడం సాధ్యం కాదని, గజ ఈతగాళ్లను రప్పించి రబ్బర్ తొడుగులను అమర్చగలిగితే.. నీటి వృథా కొంతవరకు లేకుండా చేయవచ్చని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం సుంకేసుల జలాశయంలో 1.2 టీఎంసీల నీరు నిల్వ ఉందని, కేసీ కెనాల్ కింద జిల్లాలో 3,820 ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తున్నామని, కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు ఇబ్బందులు లేకుండా నీటిని నిల్వ చేశామని డీఈ ప్రసాద్ వివరించారు. ఖర్చులకు వెనుకాడకుండా గేట్లను మరమ్మతులు చేయాలని, కలెక్టర్‌తో మాట్లాడి నిధులను విడుదల చేయిస్తామని జేసీ తెలిపారు. జేసీ వెంట సబ్ ఇంజనీర్ భరత్ పాల్గొన్నారు.

చిన్న కాంట్రాక్టర్లకు అండగా ఉంటాం

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల



డైరీని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిన్న కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించి, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఆదివారం నగర శివారులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్‌కా) ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్లను దోపిడీదారులగా చూసిందని, తమ ప్రభుత్వం కాంట్రాక్టర్లను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేసి, ఆర్థికాభివృద్ధిలో వారికి సహకరిస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల పంపిణీకే సరిపోతుందని వైసీపీ రూ.10లక్షల కోట్ల అప్పును రాష్ట్రంపై మోపి వెళ్లిందన్నారు. గతంలో కాంట్రాక్టర్లకు ఆర్థిక శాఖ అధికారులు, మంత్రులు అందు బాటులో ఉండేవారు కాదని.. కానీ సమస్యను సానుకూలంగా చర్చించి పరిష్కారానికి మార్గం కనుగొనాలనే ఉద్దేశంతోనే తాను ఈ సమావేశానికి వచ్చినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్లు పరస్పర సహకారంతో నడుచుకున్నప్పుడే బిల్లు బకాయిల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. గ్రామ పంచాయతీలకు స్వయంగా నిధులను వినియోగించుకునేలా అధికారాలు ఇచ్చామని, అదే విధంగా రాబోయే మార్చిలోపు మున్సిపాలిటీల్లోనూ నిధులను వారే ఖర్చు పెట్టుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రాన్ని పునఃనిర్మించడానికి కాంట్రాక్టర్ల పాత్ర అవసరమన్నారు. విశాఖ (ఉత్తర) ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ఆశాజ్యోతి పయ్యావుల కేశవ్ అని, సమస్యలను పరిష్కరించేం దుకు ఎప్పుడూ ముందుంటారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ పనులు చేసిన వెంటనే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆర్థిక శాఖ కార్యదర్శిని కలవాలంటేనే గగనంగా ఉండేదని, అటువంటిది తమ కార్యక్రమానికి ఆర్థిక మంత్రే రావడం హర్షణీయమన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, సబ్కా వ్యవస్థాపక అధ్యక్షుడు పిపి రాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న వాల్మీకి నాయకులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది వాల్మీకి శేషాద్రి మరణానికి కారణమైన నిందితులను తక్షణమే శిక్షించాలని వాల్మీకి సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు తలారి కృష్ణ నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఒక ప్రైవేటు హోటల్‌లో జిల్లాలోని వాల్మీకి సంఘాల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి శేషాద్రి న్యాయవృత్తి చేపట్టి ఎంతో మంది పేద ప్రజలకు సేవ చేశారన్నారు. అలాంటి వ్యక్తిని కొందరు ఎన్నో చిత్రహింసలు గురి చేశారన్నారు. కార్యక్రమంలో హరి, మద్దిలేటి, మండ్ల శేఖర్, రవి, శంకర్ నాయుడు, గోపాల్, శంకర్, మధు, శంకర్ పాల్గొన్నారు.

మాధవుడిని దర్శించుకున్న హంపీ పీఠాధిపతి



దర్శించుకుంటున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ

కోడుమూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయంలో ఆదివారం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు పూర్ణకుంభంతో ఎదురేగి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న విద్యారణ్యస్వామిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామిజీకి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇదే స్ఫూర్తితో పని చేయాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేయడం వల్లనే జిల్లాలో గణనీయంగా నేరాలు తగ్గాయని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో బాగా పని చేయాలని జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ జి. బిందుమాధవ్ అభినందించారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కొనసాగించాలన్నారు. వివిధ కేసులలో, విధులలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను సిబ్బంది అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, సోమన్న, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆస్పరి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న హుళాత్తూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే యువకుడు ఆదివారం ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ఉల్లిగమ్మ, రంగన్న దంపతులకు చెందిన చంద్రశేఖర్ కుటుంబ సమస్యలపై విరక్తి చెంది ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతను ఆదోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితునికి భార్య, ఒక కూతురు ఉన్నారు.

ఎస్ఐ మృతి



నాగవీరయ్య (ఫైల్)

కొలిమిగుండ్ల/ తాడిపత్రి/, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగవీరయ్య (60) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన నాగవీరయ్య 2021లో ఉద్యోగోన్నతిపై తాడిపత్రి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. నాలుగురోజుల క్రితం ఆయన సొమ్మసిల్లి పడిపోవడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. తాడిపత్రికి తరలించి, పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్ఐకి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు

- ఆత్మకూరులో ఆసక్తిగా మారిన నామినేటెడ్ పదవుల ప్రక్రియ


ఆత్మకూరు మార్కెట్ యార్డు కార్యాలయం


ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

ఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో ఎట్టకేలకు నామినేటెడ్ పదవుల భర్తీపై కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు, సొసైటీల కమిటీలను భర్తీ చేయాలని చెప్పడంతో ఆ ప్రక్రియను ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వేగవంతంగా చేపడుతున్నా రు. ఇందులో భాగంగానే ఆత్మకూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా వెలుగోడు మండలంలోని రేగడూగూడురు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత వంగాల కృష్ణారెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. అదే క్రమంలో వైస్ ఛైర్మన్ ఆత్మకూరు పట్టణానికి చెందిన ఓ మైనార్టీ నాయకుడికి కేటాయించేందుకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలిసింది. డైరెక్టర్ల నియామకంలో మరికొంత మందికి అవకాశం కల్పించడంతోపాటు బీజేపీ, జనసేన పార్టీల వారికి కూడా చోటు కల్పించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ప్రస్తుతం ఎన్నికలతో కాకుండా త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఆత్మకూరు పట్టణానికి చెందిన టీడీపీ సీనియన్ నాయకులు షాబుద్దీన్ నియమిస్తారనే పేరు బలంగా వినిపిస్తోంది. అదే క్రమంలో డైరెక్టర్లుగా నల్లకాల్వ గ్రామా నికి చెందిన రమేష్, వెంకటాపురం గ్రామానికి చెందిన తెనే ప్రవీణ్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. కొద్ది రోజుల వ్యవధిలోనే ఆయా పాలక కమిటీలకు సంబంధించి ఆమోద ముద్ర లభించనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇదే జరిగితే జనవరిలో ఈ ప్రక్రియంతా పూర్తయ్యే అవకాశం లేకపోలేదు. ఈ అంశం ఆత్మకూరు ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్న నేతలు :

శ్రీశైల నియోజకవర్గంలో 20ఏళ్ల తర్వాత టీడీపీ గెలుపొందడంతో ఆ పార్టీ వెంట ఇంతకాలం నడిచిన ఎంతో మంది సీనియర్ నాయకులు కీలక పదవుల కోసం వెంపర్లాడుతున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి ఒక్క ఆత్మకూరులోనే శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు శాకమూరి గిరిరాజు, ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన తిరుపమయ్య, టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు కలిముల్లా, టీడీపీ పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెన్నా శ్రీధర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఇస్కాల రమేష్, కొప్పరపు రవిప్రసాద్, అర్బన్ కాలనీకి చెందిన బీసీ నాయకులు మాయలూరి రమణ తదితర నాయకులతో పాటు మరికొంత మంది పదవుల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో కొంత మంది రాష్ట్రస్థాయి పదవుల కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే చాలా మంది నాయకులు తమ బయోడేటాలను తమ నాయకుడికి ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం వీలైంత త్వరగా అందుబాటులో ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేసి ఆ తర్వాత మరో విడతలో మరికొందరికి అవకాశం కల్పించేలా పార్టీ అధిష్టానం నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాగా రాష్ట్ర స్థాయిలో ఏర్పాటయ్యే వివిధ కార్పొరేషన్లు, ఫెడరేషన్లలో కూడా నియోజకవర్గం నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇక్కడి నాయకులు అభిప్రాయ పడుతున్నారు. ఏదిఏమైనా.. సంక్రాంతి పండుగ నాటికి కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి మరి.

ఉదారవాద ఆర్థిక విధానాలపై పోరాటం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్

ఆత్మకూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, మతోన్మాదంపై ప్రజా పోరాటం చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు కేంద్రానికి లొంగిపోయాయని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో విఫలమయ్యాయని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వామపక్షాలు, అభ్యుదయ శక్తుల ప్రాధాన్యత పెరిగిందని గుర్తు చేశారు. వికసిత్ భారత్ - 2047 అని కేంద్రంలో, స్వర్ణాంధ్ర ప్రదేశ్ అని రాష్ట్రంలో ప్రజలను మభ్యపడుతున్నారని విమర్శించారు. సమావేశంలో స్వాములు, రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, వీరన్న, నాగేశ్వరరావు, భాస్కర్, వలి పాల్గొన్నారు.

శంఖారావన్ని విజయవంతం చేయండి


సమావేశమైన విశ్వ హిందూ పరిషత్ నాయకులు

పాములపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని. మండల విశ్వహిందూ పరిషత్ నాయకులు సత్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చౌడేశ్వరీ దేవి అలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలోని గన్నవరం సమీంలోని కేసరపల్లిలో జనవరి 5న లక్షలాది మంది హిందువులతో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం భారీ సభకు హిందువులంతా కలిసి కట్టుగా పాల్గొని సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు నాగరాజు, సాయిక్రిష్ణ, వెంకటేశ్వరరరావు, మల్లికార్జున, మధుక్రిష్ణ, హరి, పెద్ద సుబ్బారెడ్డి, శ్రీక్రిష్ణ, వెంకటేశ్వర్లు, చంద్రశేఖరరావు, గోవిందు, సురేశ్, శ్రీనివాసులు, చిన్న పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాధవీలతకు జాతీయ ప్రతిభా అవార్డు


మాధవీలత

నంద్యాల కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన బాల అకాడమీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మాధవీలత జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు బాల అకాడమీ కరస్పాండెంట్ రవీం ద్రనాథ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడు తూ విద్యార్థులకు బచ్‌పన్ అనే యాక్టివిటీ అనే సరికొత్త సృజనాత్మ కతతో కూడిన విద్యను మొదటిసారిగా నంద్యాలలో ప్రారంభించి, సాధారణ ప్రతిభ కలిగిన విద్యార్థులు సైతం మొదటి ర్యాంకులు వచ్చేవిధంగా ప్రోత్సహించడంలో ఆమె చేస్తున్న సేవలకు గుర్తింపుగా దక్షిణాది ప్రవేటు ఉపాధ్యాయుల, అధ్యాపకుల ఆర్గనైజేషన్ నిర్వాహకు లు సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభ అవార్డుకు ఎంపిక చేసినట్లు బాల అకాడమీ కరస్పాండెంట్ రవీంద్రనాథ్ తెలిపారు. ఈ అవార్డును జనవరి 5వ తేదీన గుంటూరులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తదితర పెద్దల చేతులమీదుగా ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు.

పాదయాత్రికులకు సత్కారం


తిరుమల పాదయాత్రికులను సత్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని కిషన్‌సింగ్ వీధికి చెందిన పలువురు తిరుమలకు దిగ్విజయంగా పాదయాత్ర చేయడం పట్ల స్థానికులు ఆదివారం వారిని ఘనంగా సత్కరించారు. కిషన్‌సింగ్ వీధికి చెందిన సుమారు పది మంది ఆత్మకూరు పట్టణం నుంచి కాలినడకన 338 కి.మీ. దూరంలో తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సన్నిధికి కాలినడకన బయలుదేరారు. సుమారు 13రోజులపాటు పాదయాత్ర చేపట్టి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వెంట తీసుకెళ్లిన వాహనంలో తిరిగి వచ్చారు. చాలా ఏళ్ల తర్వాత ఆత్మకూరు నుంచి తిరుపతికి పాదయాత్రగా దిగ్విజయంగా పూర్తి చేసుకోవడంతో స్థానికులు శేషఫణి, శ్రీధర్, రమేష్, మురళీ, మల్లికార్జున, సుమన్, సురేష్ తదితరులు వారిని శాలువా, పూలమాలలతో సత్కరించి మిఠాయిలు అందజేశారు.

రోడ్లపై గుంతల పూడ్చివేత


రోడ్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆత్మకూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేత చర్యలను మున్సిపల్ అధికారులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఇప్పటికే పెద్దబజారు, గాంధీపార్క్, పాతబస్టాండ్ తదితర ఏరియాల్లో గుంతలను, రోడ్ల జాయింట్లను గుర్తించి వాటిని పూడ్చివేశారు. తాజాగా కళాంజలి గ్రాఫిక్స్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, గౌడ్‌సెంటర్, నంద్యాల టర్నింగ్, రఘునాథ్ సెంటర్ తదితర ఏరియాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసే పనులను చకచక చేపడుతున్నారు. అదేవిధంగా పట్టణ సుందరీకరణలో ఆత్మకూరు మీదుగా వెళ్లే కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌కు కూడా రంగులతో తీర్చిదిద్దుతున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా జరిగే సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన నిర్వహిస్తున్నా మని అన్నారు. వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్, ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరు కావాలని కోరారు.

దుర్గాభోగేశ్వర స్వామి క్యాలెండర్ ఆవిష్కరణ


దుర్గాభోగేశ్వరస్వామి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకట్‌రెడ్డి

గడివేముల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గడిగరేవుల సమీపంలో వెలసిన దుర్గా భోగేశ్వరస్వామి క్యాలెండర్‌ను ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట్ రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గాభోగేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని అన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన దుర్గాభోగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రామానుజన్, ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై చర్చకు రావాలి: ఎమ్మెల్యే

ఆత్మకూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలపై దమ్ముంటే చర్చకు రావాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనంతా అబద్ధాలు, అవినీతితోనే సాగిందని మండిపడ్డారు. వైసీపీ పాలన లో ఏపీ డిస్కంలు, ఏపీఎస్‌డీసీఎల్ నిర్వహణ వైఫల్యాల వల్ల మొత్తంగా రూ.1,29,503 కోట్లు విద్యుత్ భారాలు ప్రజలు పడ్డాయని గుర్తు చేశారు. తప్పుడు పనులన్ని చేసి ఏమీ తెలియనట్లుగా ధర్నాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని దుయ్యబట్టారు.

నంద్యాల జిల్లాలో కార్డన్‌సెర్చ్


గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

నంద్యాల క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. నంద్యాల వన్‌టౌన్, కొలిమిగుండ్ల, జూపాడుబంగ్లా, నందివర్గం తదితర పోలీస్ స్టేషన్ల పరిధుల్లో ఆయా స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బంది, క్యూఆర్టీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. నేరచరిత్రగలవారు, అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లల్లో సోదాలు చేశారు. సోదాల్లో సరైన ధ్రువపత్రాల్లేని 35 మోటార్‌సైకిళ్లతోపాటు ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలతో పోలీస్ అధికారులు సమావేశం నిర్వహించి సమాజంలో జరిగే సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు తదితరవాటిపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ఐకమత్యంతో జీవించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఎవరైనా కొత్తవ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

మహానందిలో సినీ నటుడు పూజలు


మహానందిలో కుటుంబ సభ్యులతో నటుడు సెల్వరాజ్

మహానంది, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో తెలుగు సినీ, టీవీ నటుడు సెల్వరాజ్ ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా వచ్చిన వీరికి ఆలయం వద్ద అర్చకులు రాజమాణిక్యశర్మ స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో అభిషేకార్చనలను జరిపారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించారు. ఇప్పటి వరకు వివిధ భాషల్లో టీవీ సీరియల్స్‌తోపాటు చిత్రాల్లో పలు ప్రాధాన్యత గల పాత్రలను పోషించినట్లు తెలిపారు. అయితే జెమినీ టీవీలో ప్రసారమైన మొగలిరేకులు, చక్రవాకం సీరియల్స్‌లో మంచి గుర్తింపు లభించినట్లు చెప్పారు. త్వరలోనే రెండు ప్రముఖ చానల్‌లో ప్రసారమయ్యే సీరియల్స్‌లో నటిస్తున్నట్లు తెలిపారు.

కళాశాల స్వర్ణోత్సవ వేడుకలకు ఆహ్వానం


నంద్యాల ఎంపీ శబరిని ఆహ్వానిస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటై 50 ఏళ్లను పురస్కరించుకుని జనవరి 4,5 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించనున్న స్వర్ణోత్సవానికి హాజరు కావాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరిని కళాశాల అధ్యాపకులు ఆహ్వానం పలికారు. నంద్యాలలోని బొమ్మల సత్రం సమీపంలో గల ఎంపీ బైరెడ్డి శబరి కార్యాలయంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి వేడుకకు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఆహ్వానించారు.

వినతులకు పరిష్కారం చూపుతాం: ఎంపీ

నంద్యాల రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వస్తున్న వినతులకు పరిష్కారం చూపుతామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం బొమ్మల సత్రంలోని ఆమె స్వగృహంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల పట్టణ సమీపంలోని కానాల, రైతునగరం గ్రామాలలో నిర్మించతలపెట్టిన 167 కే రహదారి బాధితులను సీఎం వద్దకు తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైల్వేస్టేషన్ సమీపంలోని చిరు వ్యాపారులకు న్యాయం జరిగేలా రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు.

● రామక్రిష్ణ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం నంద్యాల డిస్ట్రిక్ యువ ఉత్సవ్ 2024 కార్యక్రమానిక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి, ఏబీవీపీ నంద్యాల పార్థసారధి రెడ్డి, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ రాహుల్ గిరిరెడ్డి, కేఎస్ అంకన్న, కళాశాల ఛైర్మన్ డా.రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్


మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారులు

నంద్యాల క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల డీఎస్పీ పి.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దాదాపు 30 మంది మైనర్లు మోటార్ వాహన చట్టాన్ని ఉల్లంఘించి వాహనాలు నడుపుతుండగా ట్రాఫిక్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన, తక్కువ వయసు ఉన్న వారందరినీ, వారి తల్లిదండ్రులను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ మైనర్లను డ్రైవింగ్ చేయడానికి అనుమతించడం వల్ల కలిగే తీవ్ర పరిణామాలను తల్లిదండ్రులకు వివరించారు. చట్టపరమైన ఇబ్బందులను సైతం వారికి తెలియజేశారు. ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి ఉండటం ప్రజలందరి విధి అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలు జరగకుండా పిల్లలను పర్యవేక్షించడం, మార్గనిర్దేశం చేయడం తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఎంవీ చట్టంలోని నిబంధనల ప్రకారం ఉల్లంఘించినవారందరికీ జరిమానా విధించారు.

తైక్వాండో అసోసియేషన్ ఏర్పాటు

ఆత్మకూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్‌న ఏర్పాటు చేసినట్లు స్పోర్ట్స్ క్లబ్ ఛైర్మన్ పస్పీల్ మున్నా ఆదివారం తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా సయ్యద్ అసదుల్లా, అధ్యక్షుడిగా ఖాజాహుసేన్, ప్రధాన కార్యదర్శిగా గొడుగు స్వామన్న, కోశాధికారిగా గొడుగు నాగన్నలను నియమించినట్లు తెలిపారు. తైక్వాండో అసోషియేషన్ నేతృత్వంలో ఇకపై క్రీడాకారులకు మరింత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ ఖోఖో, కబడ్డీ శిక్షకులు అజగర్ అలి, మహెబూబ్, వెంకటేశ్వరగౌడ్ తదితరులు ఉన్నారు.

నంద్యాల కవులకు ప్రశంసలు


నంద్యాల కవులను అభినందిస్తున్న మంత్రి సత్యప్రసాద్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పలు సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తూ అనేక సదస్సుల్లో పాల్గొంటూ భాషా సౌరభాలను భావితరాలకు అందిస్తున్న నంద్యాల కవులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అభినందించారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు రచయతల మహాసభలకు మంత్రి సత్యకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగుభాషా వికాసం, వైభవమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నంద్యాల కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, మహ బూబ్‌బాషా, నీలకంఠమాచారి, వెంకటేశ్వర్లు, శేషఫణి, ప్రసాద్, నరేంద్ర, సతీష్, లింగమయ్య, ఉపాధ్యాయ సంఘంనేతలు వీరబ్రహ్మం, చంద్రుడు, విట్టా రమేష్‌లను మంత్రి సత్యకుమార్ సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మండలి బుద్ధప్రసాద్ అభినందించి సత్కరించారు.

నంద్యాల విద్యార్థికి బాలచిత్ర కళారత్న అవార్డు



బాలచిత్ర కళారత్న అవార్డు అందుకుంటున్న సాయిహవీష్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన పల్లా రమేష్ స్వర్ణ దంపతుల కుమారుడు సాయి హవీష్ (7వ తరగతి) కోటేష్ ఆర్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. సాయిహవీస్‌కు ప్రతిష్ఠాత్మకమైన బాల చిత్రకళ రత్న అవార్డు సాధించినట్లు అకాడమీ నిర్వాహకులు కోటేష్ తెలిపారు. నెల్లూరులోని అమీర్‌ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి చిత్రకళ ప్రదర్శన పోటీలు నెల్లూరులో నిర్వహించారు. డిసెంబరు 29న ఆదివారం జరిగిన పోటీల్లో నంద్యాల కోటేష్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఎనిమిది మందికి అవార్డులు వచ్చాయని అకాడమీ నిర్వాహకులు కోటేష్ తెలిపారు. ఇందులో సాయి హవీస్ చిత్రించిన రాణాప్రతాప్‌సింగ్ చిత్రానికి బాలచిత్రకళారత్న అవార్డు కింద ప్యూర్‌గోల్డ్‌మెడల్, మెమెంటో ఇచ్చి సన్మానించారన్నారు.

దివ్యాంగుల చట్టంపై అవగాహన సదస్సు


దివ్యాంగుల చట్టాల గురించి వివరిస్తున్న చిత్రాల రాజేష్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సంకల్ప్ స్కూల్ నందు ఆదివారం ఉదయం సక్షమ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిచారు. సక్షమ్ జిల్లా అధ్యక్షుడు నేట్ల మహేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిత్రాల రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సక్షమ్ అనే సంస్థ దివ్యాంగుల కోసం పని చేసే సేవా సంస్థ అని పేర్కొన్నారు. దివ్యాంగుల చట్టం మార్పిడి యాక్ట్ 2016 గురించి అడ్వకేట్ సింహ మల్లికార్జున గురించి వివరించారు. అలాగే దివ్యాంగులు సక్షమ్ దివ్యాంగ సేవా కేంద్రానికి దివ్యాంగులు తమ పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో మహేశ్వరరెడ్డి పీవీ రమణయ్య, సుబ్బారావు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఎ.కోడూరులో భారీగా టీడీపీ సభ్యత్వాలు



టీడీపీ సభ్యత్వాలు చేయిస్తున్న వడ్డు మధుసూదన్‌రెడ్డి

బండిఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కోడూరులో తెలుగుదేవం పార్టీ సభ్యత్వాలు స్థానిక టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా చేపట్టారు. పార్టీ అధినేత సీఎం చంద్రబాబునాయుడు, యువనేత లోకేశ్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పిలుపు మేరకు దాదాపు గ్రామంలో ఇప్పటి వరకు 1200 సభ్యత్వాలు చేయించామన్నారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారు రూ.100 చెల్లించి రూ.5 లక్షల ప్రమాద బీమాతోపాటు, పార్టీ తరపున వారి పిల్లల చదువు, వైద్య సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో స్టాలిన్‌రాజు, కుమార్, వేమారెడ్డి, శంకర్, హరి, దానియేలు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లగా పదోన్నతులు కల్పించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గోర్ల సుధాకర్ అన్నారు. ఆదివారం నంద్యాల ఎస్టీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాల విద్యలో వివాదాస్పదంగా ఉన్న జీవో 117ను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఇప్పటికే ప్రకటించారరి అన్నారు. అలాగే జూనియర్ కళాశాలలో పోస్టుల భర్తీలో వివాదాస్పదమవుతున్న జీవో 223ను కూడా రద్దు చేయాలని కోరారు. 1993లో తీసుకువచ్చిన 302 జీవో ప్రకారం ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను 40శాతం జేఎల్‌గా భర్తీ చేసే అవకాశం ఉన్నప్పటికీ ఆ నిబంధనను గతంలో తొలగించారని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుపేంద్రుడు, శ్రీనివాసులు, సభ్యులు రామక్రిష్ణ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి


విజేత హనుమాన్ జట్టు

ఆత్మకూరు రూరల్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవా లని సర్పంచ్ గ్రంధివేముల దరగయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బాపనంతాపురం గ్రామంలో క్రిస్మస్ ఉత్సవంలో భాగంగా గత రెండు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో గెలుపొందిన టీంలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ఆత్మకూరు, ఓంకారానికి చెందిన జట్లు తల పడగా అందులో ఆత్మకూరుకు చెందిన హనుమాన్ జట్టు గెలుపొందినట్లు తెలిపారు. ఆత్మకూరుకు చెందిన హనుమాన్ జట్టుకు మొదటి బహుమతి రూ.10,016లు అడ్వకేట్‌లు వేముల వెంకటేశ్వర్లు, శివశంకర్‌లు, రెండో బహుమతిగా ఓంకారం జట్టుకు పార్థసారథి చేతుల మీదుగా రూ.5,016 అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వైభవంగా గోదాదేవి పూజలు



కోదండరామాలయంలో గోదాదేవికి పూజ చేస్తున్న మహిళలు

చాగలమర్రి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం గోదాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గోదాదేవిని పూలతో అలంకరించి సామూహిక వ్రతం నిర్వహించారు. లలిత పారాయణం చేశారు. సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు, పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

బేతంచెర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో ఈ నెల 31న నిర్వహించనున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయం ఆవరణలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అనేక ఉద్యమాలు చేపట్టి పేదలకు భూమి పంపిణీ చేయడంలో ఎందరో వీరుల ప్రాణ త్యాగాల తో సమరశీల ఉద్యమాలు నిర్మించిన సీపీఐ శతాబ్ది ఉత్సవాలు డోన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ హాజరు కానున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుమలేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అబాకస్‌లో విద్యార్థిని ప్రతిభ

బేతంచెర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన అబాకస్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థిని రమ్యను ప్రకృతి పాఠశాల కరస్పాండెంట్ రవికుమార్ రెడ్డి అభినందించారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ప్రకృతి పాఠశాలలో చదువుతున్న 7వ తరగతి విద్యార్థిని రమ్య ఆదివారం కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పోటీలో సీనియర్ విభాగంలో రెండో బహుమతి సాధించిందన్నారు. ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయులను, విద్యార్థిని రమ్యను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, ప్రసాద్ రెడ్డి, స్రవంతి, భాగ్యవతి, లలితదుర్గ, శ్రీలేఖ విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సర్వేయర్ మృతి

బేతంచెర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మదనకేశాలు (47) అనే సర్వేయర్ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. బేతంచెర్ల దుర్గాపేటకు చెందిన మదనకేశాలు గూటుపల్లె గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వహించేవారు. ఈ నెల 26న పట్టనంలోని శేషారెడ్డి పాఠశాల సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం బేతంచెర్ల ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మహాలక్ష్మి, కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చేతి పంపులకు మరమ్మతులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తున్నట్లు సర్పంచ్ జినుగు శివరాముడు తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, నాయినిపల్లె రహదారిలో ఉన్న చేతి పంపులకు సిబ్బందితో కలిసి సర్పంచ్ మరమ్మతులు చేయించారు. గ్రామంలో మొత్తం ఎనిమిది చేతి పంపులు ఉన్నాయని, వీటన్నిటికీ మరమ్మతులు చేయించనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

సభను జయప్రదం చేయండి

చాగలమర్రి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చే నెల 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధి కళాధర్ రెడ్డి కోరారు. ఆదివారం చిన్నవంగలి గ్రామంలో హైందవ శంఖారావం ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఇంటింటి కి వెళ్లి పత్రికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, శివరామి రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

'ఎస్సీ ధ్రువీకరణ పత్రాల కోసం పోరాడాలి'

డోన్ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాదసి, మాదారి కురువలు ఐకమత్యంతో ఎస్సీ ధ్రువీకరణ పత్రాల కోసం పోరాడాలని ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు బి.రంగన్న పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం పట్టణ సమీపంలోని దత్తాత్రేయ స్వామి ఆలయ ప్రాంగణంలో పట్టణ, మండల కమిటీల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. నాయకులు సోమలింగడు, శివలింగడు, మద్దిలేటి, నాగరాజు, బత్తిన మునిస్వామి, రంగన్న, రవిమోహన్, మల్లికార్జున పాల్గొన్నారు.

మంచు తెరల్లో దోబూచులాట

- పొగమంచుతో వాహనదారుల ఇక్కట్లు



చాగలమర్రి 40వ జాతీయ రహదారిపై లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు

కొలిమిగుండ్ల/చాగలమర్రి/ఉయ్యాలవాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంచు కురిసే కాలం వచ్చేసింది .. అప్రమత్తంగా ఉండకపోతే ముంచేస్తానంటూ హెచ్చరిస్తోంది .. పొద్దు పొడిచినా సూర్యుడు కనపడకుండా కప్పేస్తున్న పొగ మంచు వాహన చోదకులను ఆందోళనకు గురిచేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించడంలేదు. దీంతో రహదారుల్లో ప్రయాణం సాహసోపేతంగా మారింది. ఆదివారం ఉదయం కొలిమిగుండ్ల మండలంలోని ఎన్‌హెచ్ 554-డి రహదారితో పాటు, నెల్లూరు-ముంబై రాష్ట్ర హైవేపై పెద్ద ఎత్తున పొగ మంచు కమ్ముకోవ డంతో వాహనదారులు ఇబ్బందుపడ్డారు. మంచుకాలం ఉదయం సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. మరోవైపు కురుస్తున్న పొగ మంచు అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే చాగలమర్రిలో ఆయా రహదారులు, పంట పొలాల్లో కూడా పొగమంచు అలుముకుంది. రోడ్లమీద ప్రయాణించే వాహనదారులు రోడ్లు కనపడక ఇబ్బంది పడ్డారు. లైట్లు వేసుకున్నప్పటికీ చాలా నెమ్మదిగా డ్రైవ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొన్నారు. శనగ, కంది పంటలపై మంచు అధికంగా పడటంతో పూత, పిందె దెబ్బతిని నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. అలాగే ఉయ్యాలవాడ మండలంలో ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచు కురిసింది. దీని కారణంగా వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఉదయం 9 గంటల వరకు ఈ పొగమంచు కొనసాగింది. శనగ పంటకు పులుసు, పూత, పిందె రాలిపోయే ప్రమాదం ఉంది.



ఉయ్యాలవాడలో పొగమంచు కారణంగా లైట్లతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు



చాగలమర్రిలో పొగమంచు



కొలిమిగుండ్లలో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

ఐక్యంగా పోరాడాలి



దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి

బేతంచెర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల నాపరాళ్ల పరిశ్రమకు దక్షిణాది రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిందని, ప్రభుత్వం రాయల్టీ విధించడంలో జాప్యం వల్ల యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, బేతంచెర్లలో రాయల్టీల సమస్య పరిష్కారానికి యజమానులందరూ ఐకమత్యంతో పోరాడాలని మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం బేతంచెర్ల పట్టణంలోని బనగానపల్లె రహదారిలో గనుల ఫ్యాక్టరీ ట్రాక్టర్ల యజమానులు మూడో రోజు చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు మాజీ ఎంపీపీ సంపూర్ణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలంలో రాయల్టీల సమస్య పరిష్కారానికి యజమానులు కృషి చేయడంతో రాయల్టీల సమస్య లేకుండా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అదే తరహాలో బేతంచెర్ల గనుల ఫ్యాక్టరీల ట్రాక్టర్ల యజమానులకు కూడా ప్రభుత్వం మంజూరు చేసేలా యజమానులు కృషి చేయాలన్నారు. నిరుద్యోగ యువత ఫ్యాక్టరీలో జీవనోపాధి పొం దుతున్న సమయంలో రాయల్టీల సమస్య వల్ల ఉపాధి కోల్పోయిందని ఆవేద న వ్యక్తం చేశారు. రిలే నిరాహారదీక్షలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, నాగేశ్వరరెడ్డి, రామ్మూర్తి, నాగమయ్య, మోహన్‌రావు, వెంకటరమణ, తిరులేష్‌రెడ్డి, ఉపేంద్ర, వెంకటేశ్వర్లు, వెంకటరాంబాబు పాల్గొన్నారు.

3న జాబ్ మేళా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జనవరి 3న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

శిరివెళ్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రౌడీషీటర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చిన్న పీరయ్య హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. క్షణికావేశానికి లోనై చేసే తప్పుల వల్ల కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సూచించారు. సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. రౌడీషీటర్లు గొడవలకు పాల్పడినా, సమస్యలు సృష్టించాలని ప్రయత్నించినా చర్యలు తప్పవన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం, యల్లావత్తుల, చిన్నకంబలూరు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలైన పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

లింగమయ్యకు ప్రత్యేక పూజలు

మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఫ్రీ జోన్‌గా ప్రకటించాలి : సీపీఐ



డోన్‌లో లోగోను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 6 నుంచి 9 తేదీల్లో శ్రీకాకుళంలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కోవెలకుంట్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణంలోని సంతమార్కెట్ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈవోఆర్డీ, కోవెలకుంట్ల మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈవో ప్రకాశ్‌నాయుడు ఆదివారం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ గిరీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి: డీఎస్పీ



జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ క్యాంపును ప్రారంభించిన డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు ఆకాంక్షించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల్లో చదువుతో పాటు క్రీడల్లో ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తిస్తారన్నారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన బస్సు

శిరివెళ్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై యర్రగుంట్ల గ్రామ సమీపంలో బైక్‌ను ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. శిరివెళ్ల పోలీసులు తెలిపిన వివరాలివీ.. గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, అతడి భార్య శ్యామలమ్మ చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడులో బంధువుల వద్దకు వెళ్లి వస్తుండగా శిరివెళ్ల మండలం యర్రగుంట్ల వద్ద బైక్‌ను బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్యామలమ్మ తీవ్రంగా గాయపడిందన్నారు. క్షతగాత్రురాలిని 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చిన్న పీరయ్య ఆదివారం తెలిపారు.

'అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి'

చాగలమర్రి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలపై ఏవైన అభ్యంతరాలుంటే ఈనెల 31లోపు దరఖాస్తు రూపంలో తెలియజేయాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో షెడ్యూల్ కులాల వారి జాబితాను అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని అన్నారు. వాటిని పరిశీలించి ఏవైన అభ్యంతరాలు ఉంటే స్థానిక వీఆర్వోలకు, కార్యదర్శులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జనవరి 10న తుది జాబితా ప్రకటిస్తామన్నారు.

పాఠశాల ముందు మురుగు కుంట

- దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకోని వైనం

- విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు



పాఠశాల ముందు ఉన్న మురుగు కుంట

కొలిమిగుండ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హనుమంతుగుండం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు అపరిశుభ్రత నెలకొంది. దీంతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడంలేదు. డ్రైనేజీకి సంబంధించిన నీరు పాఠశాల ముందే నిలుస్తుండటంతో సమస్యగా మారింది. రోజుల తరబడి మురుగు నీరు నిలవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలకు ఆవాసంగా మారింది. దీంతో విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. కాగా వాస్తవానికి పాఠశాల ప్రధాన గేటు సైతం ఈ మురుగు కుంట వైపే ఉండేది. లోపలికి వెళ్లడానికి సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో గేటును మరోవైపు మార్చడంతో రాకపోకలు సాగుతున్నాయి. దుర్వాసన, అపరిశుభ్రత మాత్రం విద్యార్థులకు తప్పడం లేదు. అధికారులు చర్యలు తీసుకొని పాఠశాల ముందు ఉన్న మురుగు కుంటను తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యం

- ఎంపీడీవో రాజేంద్రప్రసాద్



చాగలమర్రి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యమని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అన్ని గ్రామాలను అభివృద్ధిబాటలో పయనించేలా చేస్తామంటూ 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: మినీ గోకులాలు ఎన్ని మంజూరయ్యాయి?

జవాబు: మండలంలో 25 మినీ గోకులాలు మంజూరయ్యాయి. 22 మినీ గోకులాల పనులు ప్రారంభించాం. ఒక్కొక్క గోకులానికి రూ.2.30 లక్షలు ఖర్చు చేస్తున్నాం.

ప్రశ్న: పల్లెపండుగ కార్యక్రమం పనుల టార్గెట్ ఏమిటి?

జవాబు: ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్‌శాఖ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేసి గ్రామాలకు కొత్త సొగసులు తెస్తున్నాం.

ప్రశ్న: గ్రామ సచివాలయాల పనితీరు ఎలా ఉంది?

జవాబు: మండలంలో 17 వార్డు సచివాలయాలు ఉన్నాయి. సచివాలయ ఉద్యోగులచే ప్రతి నెల పింఛన్‌లు పంపిణీ చేయడంలో జిల్లాలో ప్రథమంగా ఉన్నాం. వివిధ పనులను వేగవంతం చేయిస్తున్నాం. స్వర్ణ పంచాయతీకి సంబంధించి డేటా సేకరణ జరుగుతోంది.

ప్రశ్న: సామాజిక తనిఖీలో బయటపడ్డ అవినీతి ఎంత ?

జవాబు: సామాజిక తనిఖీ విచారణలో రూ.8.50లక్షల అవినీతి బయటపడింది. ఉపాధి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిచే నిధులు రికవరీ చేయిస్తాం.

ప్రశ్న: మండల అభివృద్ధి అధికారిగా మీ లక్ష్యం ఏమిటి?

జవాబు: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.

'అధికారిపై దాడి బాధాకరం'

డోన్ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో స్థాయి అధికారిపై దాడి చేయడం బాధాకరమని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎస్ భానుసింగ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ అధికారులు సేవలందిస్తున్నారని, విధి నిర్వహణలో ఉన్నా అధికారులపై దాడులకు పాల్పడడం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు గాలయ్య, గోపాల్, రామనాథ్ రెడ్డి, తదదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయించరాదు



చాగలమర్రిలో దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ, పోలీసులు

చాగలమర్రి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు, విద్యార్థులకు పొగాకు ఉత్పత్తి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మత్తు కలిగించే గుట్కా, తంబాకు, కుల్లిబ్ తదితర వాటిని విక్రయించరాదని ఎస్ఐ అన్నారు. మైనర్లు, విద్యార్థులకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శంకర్, పోలీసులు ఉన్నారు.

యాచకుడి మృతదేహానికి అంత్యక్రియలు

డోన్ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తి రోడ్డులోని అమ్మ హోటల్ సర్కిల్‌లో అనారోగ్యంతో మృతి చెందిన యాచకుడి మృతదేహానికి ద్రోణాచలం సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. నల్గొండ జిల్లాకు చెందిన బంగారయ్య అనే యాచకుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ద్రోణాచలం సేవా సమితి సభ్యులు హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు షాదీకానా రాజా, గురు స్వామి, దాదా హుశేన్, శివారెడ్డి తదితరులున్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

చాగలమర్రి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో అధిక ప్రాధాన్యత, ప్రత్యేక రక్షణ చట్టం కల్పిస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడం హర్షణీయం అన్నారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, చిన్నికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని ముందుకు సాగాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి అన్నారు. ఆదివారం పట్టణంలోని పాతపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక నూతన సంవత్సర క్యాలెండర్ల ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు సర్వజ్ఞ మూర్తి, యుటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన అభ్యున్నతికి తోడ్పాటు అందించాలి

శాలివాహన సంఘం అభ్యున్నతికి సంఘం సభ్యులు తోడ్పాటు అందించాలని శాలివాహన సంఘం అధ్యక్షుడు కుమ్మరి రాజు, జిల్లా ఉపాధ్య క్షులు కుమ్మరి ఓబులేసు, శేషఫణి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పాతపేట రామాలయంలో శాలివాహన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్క రించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.